సాక్షి మెదక్

శుక్రవారం | 30 | మే | 2025



ఫోనొస్తేనే ఎంపిక..

బ్యాంకు అధికారుల నుంచి ఫోన్ వస్తేనే రాజీవ్ యువ వికాసానికి ఎంపికైనట్లుగా గుర్తించాలి.

వివరాలు 8లో ▸



వర్షాకాలం.. జీవాలు భద్రం

రైతులు వర్షాకాలంలో జీవాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వివరాలు 8లో ▸



నిరుపయోగం.. నిఘా నేత్రం

రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఇసుక డంప్‌లు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్

పాపన్నపేట(మెదక్): ‘మనక చీకట్లో ఇసుక దోపిడీ’ శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ సతీశ్‌కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సంఘటనా స్థలికి వెళ్లి అక్రమంగా నిల్వ చేసిన మూడు ఇసుక డంపులను సీజ్ చేశారు. ఆ ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించాలని మెదక్ ఆర్డీఓకు లేఖ రాశారు. అప్పటివరకు ఇసుక డంపులపై పంచాయతీ కార్యదర్శి నిఘా పెట్టేలా ఉత్తర్వులు ఇవ్వాలని, జిల్లా పంచాయతీ అధికారికి లేఖ రాసినట్లు చెప్పారు. మంజీరా నది నుంచి ఇసుక అక్రమ రవాణా నిరోధించేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను కోరినట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో చెరువులకు వరదనీరు వచ్చే ఫీడర్ చానల్, చేపల చెరువులు, గొర్రెల, పశువుల షెడ్డులను నిర్మించుకునేందుకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఇంకుడు గుంతలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదర్, ఎంపీఓ గిరిజరాణి, ఏపీఓ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామాయంపేట(మెదక్): మండలంలోని లక్ష్మాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ తిరుపతిరెడ్డి తెలిపారు. లక్ష్మాపూర్, తొనిగండ్ల, సదాశివనగర్, బాపనయ్య మోతుకుల తండాల ప్రజలు సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



డంప్‌యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సురేశ్‌బాబు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చిల్వెర, గొల్లకుంట తండా గ్రామ పంచాయతీలను మెదక్ డీఎల్‌పీఓ సురేశ్‌బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీలోని డంప్‌యార్డు, నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చేది వర్షాకాలం కావున పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీఓ లింగప్ప తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి




లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ

అల్లాదుర్గం(మెదక్): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీడబ్ల్యూఓ హైమావతి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని నీలకంఠపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారుల బరువు, కొలతలను పరిశీలించారు. అనంతరం సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆమె సూచించారు. గ్రామాల్లో పర్యటించి బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా కేంద్రాల్లో చిన్నారుల పేర్లు నమోదు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అల్లాదుర్గం ప్రాజెక్టు అధికారిణి పద్మలత, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్‌ల.. చీటింగ్!

నిర్ధారణకు వెళితే నిలువు దోపిడీ!

- జిల్లావ్యాప్తంగా 52 ల్యాబ్‌లు
- అనుమతిలేనివి డబుల్
- నిబంధనలకు పాతర
- పట్టించుకోని వైద్యాధికారులు



ప్రజారోగ్యంతో పరీక్ష కేంద్రాల (ల్యాబ్) నిర్వాహకులు చెలగాటం ఆడుతున్నారు. వ్యాధి నిర్ధారణకు వెళితే నిలువు దోపిడీ చేస్తున్నారు. నిబంధనలు విస్మరించి అనుమతి లేకుండానే యథేచ్ఛగా నడుపుతున్నారు. అర్హత లేకున్నా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కో ల్యాబ్‌లో ఒక్కో రకం ఫలితాలు వస్తుండడంతో రోగులు ఏది నమ్మాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా వైద్యారోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. – మెదక్ మున్సిపాలిటీ

వాస్తవానికి ఒక ల్యాబ్ ఏర్పాటు చేయాలంటే వైద్యశాఖ నుంచి అనుమతి తప్పనిసరి. అన్నిరకాల చికిత్సలకు సంబంధించిన పరికరాలు ఉండాలి. ఎంబీబీఎస్ డాక్టర్‌తో పాటు పాథలాజిస్ట్, టెక్నీషియన్, మైక్రో బయాలజిస్ట్ ఉండాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఇవేమీ లేకుండానే యథేచ్ఛగా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. రోగుల అవసరాలను ఆసరాగా చేసుకొని ల్యాబ్ నిర్వాహకులు వివిధ రకాల పరీక్షల పేరుతో ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలో అనుమతి పొందిన 52 (ల్యాబ్) డయాగ్నొస్టిక్ సెంటర్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కాని అంతకు రెట్టింపు స్థాయిలో అనుమతిలేనివి కొనసాగుతున్నట్లు సమాచారం.

సీజన్‌లో జోరుగా దందా!

వర్షాకాల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి. ఈ సమయంలో ఆస్పత్రుల్లో ఎక్కువగా రోగులు చేరుతుంటారు. ఇదే సమయంలో కొన్ని అస్పత్రులకు అనుసంధానంగా ల్యాబ్‌లు లేకపోవడంతో వైద్యులు సూచించిన ల్యాబ్‌లకు పరీక్షలకు వెళ్తుంటారు. ఇదే అదనుగా కొందరు ఎక్కువ వసూలు చేస్తున్నారు. రూ. 100కు నిర్వహించే పరీక్షకు రూ. 500 వరకు బిల్లులు వేస్తున్నారు. నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు ఉన్న ల్యాబ్‌లో పరీక్ష చేయించుకోవాల్సి ఉంటుంది. కాని కొందరు వైద్యులు తమకు కమీషన్లు ఇచ్చే ల్యాబ్‌లకు వైద్య పరీక్షల కోసం రోగులను పంపుతున్నారు.

కానరాని ఫీజు బోర్డులు

మెడికల్ ల్యాబ్‌లలో ఆయా వైద్య పరీక్షలకు సంబంధించి ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి. జిల్లాలో కొనసాగుతున్న ల్యాబ్‌లలో అధికశాతం వాటిల్లో ధరల పట్టికలు కనిపించడం లేదు. ఒకవేళ ధరల పట్టికలు పెడుతున్నా.. వాటిని రోగులకు కానరాకుండా ఏర్పాటు చేస్తున్నారు. ఒకే రకమైన టెస్ట్‌లకు ఒక ల్యాబ్‌కు మరో ల్యాబ్‌కు ధరల విషయంలో చాలా వ్యత్యాసం ఉంటుంది. పెద్ద ల్యాబ్‌ల నిర్వాహకులు రాయితీలను ప్రకటిస్తున్నారంటే.. ఏ స్థాయిలో దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

నియంత్రణ కరువు

సాధారణంగా ల్యాబ్‌లు ఐదేళ్ల కోసారి లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలి. లైసెన్స్ ఇచ్చిన తర్వాత ఐదేళ్ల పాటు ల్యాబ్ దరిదాపుల్లోకి అధికారులు వెళ్లడం లేదు. దీంతో సదుపాయలు, అవసరమైన యంత్ర పరికరాలు లేకపోయినా నిర్వాహకులు అలాగే నడిపించేస్తున్నారు. అయితే తనిఖీలు చేయకుండా ఉండేందుకు నిర్వాహకులు అధికారులను మచ్చిక చేసుకుంటున్నట్లు బహిరంగ ఆరోపణలు ఉన్నాయి.

తనిఖీలు నిర్వహిస్తున్నాం



జిల్లాలో ప్రైవేట్‌గా 52 ల్యాబ్‌లు ఉన్నాయి. వీటిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎవరైనా నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం. ఆస్పత్రిని బట్టి ధరలు ఉంటాయి. అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి రాలేదు. వచ్చే నెలలో ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులతో సమావేశం నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేస్తాం.

– శ్రీరాం, డీఎంహెచ్‌ఓ

రోడ్డు భద్రత.. జీవితానికి రక్షణ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పక్కన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: రోడ్డు భద్రతను మెరుగుపరిచి ప్రజల ప్రాణాలను కాపాడవచ్చునని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి జిల్లాలోని వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా రహదారి భద్రత, ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్, నేషనల్ హైవే ద్వారా చేపట్టే ప్రణాళికలను చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలను పక్కా ప్రణాళికతో క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలను కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువుపైనే దృష్టి సారించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం లేకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నిరంతర తనిఖీలు నిర్వహించి గంజాయి, మత్తు పదార్థాల రవాణాను అరికడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సర్దార్ సింగ్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎంహెచ్‌ఓ శ్రీరాం, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, నేషనల్ హైవే, పోలీస్, రెవెన్యూ, రవాణా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐదు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి

నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మహిపాల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మరో ఐదు రోజుల్లో మండలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ అన్నారు. గురువారం చిలప్‌చెడ్ రెవెన్యూ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులను పరిశీలించడంతో పాటు చిట్కుల్‌లో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను రెండు బృందాలు పరిష్కరిస్తున్నాయని తెలిపారు. రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదని, లారీల కొరత లేకుండా చేసి మరో ఐదు రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. రైతులు తేమశాతం తక్కువ ఉండేలా చూసుకుంటూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సహదేవ్, డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నెల రోజులైనా ధాన్యం కొనరా?



గడిపెద్దాపూర్‌లో 161 జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

గడిపెద్దాపూర్ రైతుల ఆందోళన

అల్లాదుర్గం(మెదక్): ధాన్యం కొనుగోలు చేయాలంటూ అన్నదాతలు ఆందోళనకు దిగారు. నెల రోజులుగా ధాన్యం బస్తాల వద్ద కాపలా ఉండాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం గడిపెద్దాపూర్ 161 జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ధాన్యం తూకం వేసినా తామే కాపలా ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో విషయం తెలుసుకున్న సీఐ రేణుకారెడ్డి, తహసీల్దార్ మల్లయ్య సంఘటన స్థలికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఇదిలాఉండగా అల్లాదుర్గం, గడిపెద్దాపూర్ కొనుగోలు కేంద్రాలను డీఎస్‌ఓ సురేశ్‌రెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ జగదీశ్వర్ తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని, రెండు రోజుల్లో తూకం వేసిన ధాన్యం తరలిస్తామని చెప్పారు. గడిపెద్దాపూర్‌లో రెండు లారీల ధాన్యం వెంటనే తరలిస్తున్నట్లు తెలిపారు. వర్షాలతో మ్యాచర్ రాక మిల్లర్లు కొనడం లేదని అన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలంతా శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. బక్రీద్ సందర్భంగా గురువారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. హిందూ, ముస్లింలు ఎలాంటి ఘర్షణలకు వెళ్లకుండా శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలన్నారు. గతేడాది జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. హిందువులు గోవులను దేవతగా పూజిస్తారు కాబట్టి, వారికి ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. ముస్లింలు ఏదైనా చట్టపరంగా, నియమ నిబంధనలకు అనుగుణంగా చేస్తే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు. చట్టానికి వ్యతిరేకంగా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నాగరాజు, ఎస్సై అమర్, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, వెటర్నరీ డాక్టర్ లక్ష్మణ్, పోలీసు సిబ్బంది, హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.


పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

మెదక్ కలెక్టరేట్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమానికి సంఘం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యను, పాఠశాలలను కాపాడుకోవడానికి ఫెడరేషన్ కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ఆర్థిక బిల్లులు చెల్లించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హీరాలాల్, నజీరొద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేందర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, పీర్‌సింగ్ బాల్‌రాజు, శివరాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం





అసలే ప్రమాదకరంగా మలుపులు.. దీనికి తోడు ఏపుగా పెరిగిన చెట్లు, ముళ్లపొదలతో మండలంలోని రంగంపేట– పైతర, తుక్కాపూర్ రహదారి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. 3 కిలోమీటర్ల పరిధిలో పదికి పైగా మలుపులు ఉన్నాయి. ఏపుగా పెరిగిన చెట్లు, ముళ్ల పొదలతో ముందు నుంచి వచ్చే వాహనం కనిపించని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్న సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

–కొల్చారం(నర్సాపూర్)

బాసర ట్రిపుల్‌ఐటీ పిలుస్తోంది

రేపటి నుంచి దరఖాస్తులు ప్రారంభం

- సర్కార్ బడిలో చదివితే 24 మార్కులు అదనం
- జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణులు 10,045 మంది



పాపన్నపేట ప్రభుత్వ పాఠశాల

పాపన్నపేట(మెదక్): సర్కార్ బడిలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ ప్రకటించింది. ఈ ఏడాది పదో తరగతిలో జీపీఏ విధానాన్ని తొలగించి, మార్కుల విధానం ప్రవేశపెట్టింది. దీనికి అనుగుణంగా బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ అడ్మిషన్లలో మార్పులు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు అదనంగా 24 మార్కులు కలపనుంది. ఈ మేరకు 2025– 26కు సంబంధించి ట్రిపుల్‌ఐటీ దరఖాస్తులు ఈనెల 31 నుంచి జూన్ 21వ తేదీ వరకు స్వీకరించనుంది. ఈసారి జిల్లాలో 10,370 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా, 10,045 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

అందుబాటులో 1,500 సీట్లు

నిరుపేద గ్రామీణ విద్యార్థులకు పదో తరగతి అనంతరం ఇంజనీరింగ్ విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ట్రిపుల్‌ఐటీలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలో ట్రిపుల్‌ఐటీ కాలేజీని నిర్మించారు. ఇందులో 1,500 సీట్లు ఉన్నాయి. ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు మంచి ప్యాకేజీతో క్యాంపస్ ఉద్యోగాలు వస్తున్నాయి. పదో తరగతిలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లు లభిస్తాయి.

ప్రభుత్వ విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం డిప్రివేషన్ స్కోర్ విధానం అమల్లోకి తెచ్చింది. గతేడాది వరకు పదో తరగతిలో గ్రేడింగ్ విధానం అమల్లో ఉన్నందున ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 0.4 గ్రేడింగ్ పాయింట్లు కలిపేవారు. ఈ విద్యా సంవత్సరం మళ్లీ మార్కుల విధానం ప్రవేశపెట్టడంతో ఆరు సబ్జెక్టులలో ఒక్కో దానికి 4 మార్కుల చొప్పున మొత్తం 24 మార్కులు కలుపనున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఆదర్శ (నాన్ రెసిడెన్షియల్) విద్యార్థులకు ఇవి వర్తిస్తాయి.

పది విద్యార్థులకు గుడ్ న్యూస్



ప్రభుత్వ పాఠశాలల్లో పది పాసైన విద్యార్థులకు ఇది గుడ్ న్యూస్. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు మాత్రమే చదువుతారు. ఈ క్రమంలో కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల నుంచి పోటీ తట్టుకోవడం ఇబ్బందికరమే. అయినా నేను 542 మార్కులు తెచ్చుకున్నా. ఇప్పుడు 24 మార్కులు కలిపితే 566 అవుతాయి. ట్రిపుల్‌ఐటీలో సీటు వచ్చే అవకాశం మెరుగవుతుంది.

– దీక్షిత, విద్యార్థిని, కుర్తివాడ

క్లుప్తంగా

ఇద్దరు నిందితుల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

నంగునూరు(సిద్దిపేట): రాత్రి పూట ఓ మహిళ ఇంట్లోకి చొరబడ్డ ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసీఫ్, ట్రైనీ ఎస్‌ఐ సౌజన్య కథనం ప్రకారం.. పాలమాకుల గ్రామానికి చెందిన సంపంగి మహేశ్ తన స్నేహితుడు పల్లెపు సంపత్‌తో కలిసి బుధవారం రాత్రి ఓ మహిళ ఇంటికి వెళ్లారు. ఆమె గట్టిగా అరవడంతో చుట్టపక్కల వారు రావడంతో పారిపోయారు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు.

ఆలయంలో చోరీ

తూప్రాన్: పట్టణంలోని మహంకాళి దేవాలయంలో హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం... దుండగులు ఆలయం ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లి రెండు హుండీలను ధ్వంసం చేశారు. అందులోని నగదు, కానుకలను దోచుకెళ్లారు. అనంతరం గర్భగుడి తలుపులు తెరిచేందుకు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. గురువారం ఉదయం భక్తులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని దామరచెరువు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగిరెడ్డి గణేశ్ (24) అప్పుడప్పుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఎవరైనా కూలీ పనులకు పిలిస్తే వెళతాడు. ఇటీవల హైదరాబాద్ వెళ్లిన గణేశ్ తిరిగి స్వగ్రామానికి రాగా గురువారం అతడి తల్లి ఫోన్ చేసి నేను, తమ్ముడు పనిచేస్తుంటే జులాయిగా తిరుగుతున్నావని మందలించింది. ఏదైనా పని చూసుకోమని చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన గణేశ్ తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు.

బాలికల చెవి కమ్మలు స్నాచింగ్

కౌడిపల్లి(నర్సాపూర్): ఆరుబయట ఆడుకుంటున్న బాలికల చెవి బంగారు కమ్మలు(పోగులు) గుర్తు తెలియని మహిళ ఎత్తుకెళ్లింది. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలోని గొల్లవాడలో గురువారం జరిగింది. ఎస్‌ఐ రంజిత్ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజం శ్రీకాంత్ మనీషా దంపతుల పిల్లలు యక్షిత, సహస్ర వీరితోపాటు ఇరుగు పొరుగు పిల్లలు ఇంటిముందు ఆడుకుంటున్నారు. కుటుంబ సభ్యులు ఇంట్లో పనులు చేసుకుంటున్నారు. ఇంతలో అటుగా వచ్చిన మహిళ పిల్లలతో మాట్లాడుతూ వారికి జామపండ్లు ఇచ్చి చెవికి ఉన్న బంగారు కమ్మలు (పోగులు) కత్తిరించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయింది. పిల్లలు ఏడుస్తూ ఇంట్లోకి వచ్చి విషయం చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు బయటకు వచ్చిచూడగా ఎవరు కనిపించలేదు. బంగారు కమ్మలు అర తులం ఉన్నట్లు బాధితులు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోవులు తరలిస్తున్న లారీ పట్టివేత

తూప్రాన్: అక్రమంగా లారీలో తరలిస్తున్న గోవులను తూప్రాన్ పట్టణంలోని పోతరాజుపల్లి వద్ద గురువారం రాత్రి గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మేడ్చల్ జిల్లా తూంకుంట నుంచి జహీరాబాద్‌కు లారీలో ఆవులు, ఎద్దులు సుమారు 40కి పైగా తరలిస్తున్నారు. లారీని మాసాయిపేట సమీపంలోని గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

[illegible](సంగారెడ్డి): గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన మండలంలోని గొల్లగూడెం గ్రామ శివారులోని జాతీయ రహదారి 65 పక్కన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గురువారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచామని, వివరాలకు పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సీఐ మహేష్ గౌడ్ తెలిపారు.

గిజిగాడి గూడు.. బాగుంది చూడు


చెట్టుకు వేలాడుతున్న పక్షి గూళ్లు

చిటారు కొమ్మన వేలాడుతూ గాలికైనా, వానకైనా చెక్కు చెదరని గూళ్లు. గడ్డిపరకలు, ఆకులు, కట్టె పుల్లలు, దూది పీకలతో పక్షులు అద్భుతంగా గూళ్లు నిర్మించుకుంటున్నాయి. సహజ నైపుణ్యంతో నిర్మించిన పక్షికి ఎంత సృజనాత్మకతో.. ఒకప్పుడు చెట్లపై పక్షులు అందంగా అల్లుకున్న గూళ్లు ఆకట్టుకునేవి. మారుతున్న కాలంలో అవి మచ్చుకైనా కనిపించడం లేదు. ఈ క్రమంలో సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఎల్లుపల్లి గ్రామ శివారులో గురువారం ఒకే చెట్టుపై పదుల సంఖ్యలో పక్షి గూళ్లు సాక్షి కెమెరాకు చిక్కిన దృశ్యమిది.

-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట


గూళ్లు అల్లుకుంటున్న పక్షులు

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీ పట్టివేత

కొండపాక(గజ్వేల్): అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీని పట్టుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం... రామచంద్రాపూర్ గ్రామ శివారులో మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌కు నీరు వెళ్లేందుకు కాలువ తవ్వకం పనులు జరిగాయి. ఇందులో వచ్చిన మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు గజ్వేల్, కుకునూరుపల్లి పరిసర ప్రాంతాల్లో వెలుస్తున్న వెంచర్లు, ఇతరత్ర పనుల కోసం టిప్పర్లలో తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఏఎస్సై జగదీశ్వర్‌తో పాటు కానిస్టేబుళ్లు రాజేష్,సంతోష్‌లతో వెళ్లి జేసీబీతో పాటు 3 టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఎస్సై ఫిర్యాదు మేరకు డ్రైవర్లు దేశెట్టి అశోక్,తురి కైలాస్,బోదాస్ మల్లేష్‌లతో పాటు జేసీబీ డ్రైవరు బాబుపై కేసు నమోదు చేశారు.

ఫోనొస్తేనే ఎంపిక.. లేకుంటే అంతే

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల్లో ఆందోళన

- ఏరియాల వారీగా బ్యాంకులకు దరఖాస్తులు
- సమాచారమివ్వని అధికారులు
- మొదటి విడత లక్షలోపు రుణాలు
- జూన్ 2 నుంచి ప్రొసీడింగ్


రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు (ఫైల్)

మెదక్ కలెక్టరేట్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకానికి జిల్లాలో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. రుణాలు వస్తే స్వయం ఉపాధి పొందవచ్చని నిరుద్యోగులు ఆశతో ఎదురు చూస్తున్నారు. లబ్ధిదారులు దరఖాస్తుల వెంట అర్హత సర్టిఫికెట్లతోపాటు వారి ఖాతా వివరాలు అందజేశారు. దరఖాస్తులు స్వీకరించిన అధికారులు లబ్ధిదారులు ఇచ్చిన బ్యాంకులకు కాకుండా గ్రామం, వార్డుల వారీగా బ్యాంకులను ఎంపిక చేసి సంబంధిత బ్యాంకులకు పంపించారు. దీంతో లబ్ధిదారుల దరఖాస్తులు ఏ బ్యాంకుకు వెళ్లాయో తెలియని పరిస్థితి. దీంతో లబ్ధిదారులు తమ దరఖాస్తు ఏ బ్యాంకుకు వెళ్లింది. ఎవరిని సంప్రదించాలనే సమాచారం లేకుండా పోయింది. ఇదే క్రమంలో సిబిల్ స్కోర్ ఆధారంగానే పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని బ్యాంకులు ప్రకటించాయి. అయితే లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని ఇటీవల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు.

కాల్ వస్తేనే ఎంపికైనట్లు..

బ్యాంకు అధికారులు దరఖాస్తులను పరిశీలించి ఫోన్ చేసి లబ్ధిదారుడికి సమాచారం ఇస్తేనే రాజీవ్ యువ వికాసానికి ఎంపికైనట్లు. లేదంటే ఎలాంటి సమాచారం ఉండదు. ఈ విషయంపై సంబంధిత అధికారులను అడిగితే సమాచారం ఇవ్వడం లేదని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. తమ దరఖాస్తులు ఏ బ్యాంకుకు పంపించారో సమాచారం ఇవ్వాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బ్యాంకులకు పంపించినవి 29,855 దరఖాస్తులు

జిల్లా వ్యాప్తంగా పథకానికి ఎస్సీలు 6,711మంది, ఎస్టీలు 3461 మంది, బీసీలు 19,686 మంది, ఈబీసీలు 550 మంది, మైనార్టీలు 2,175 మంది, క్రిస్టియన్లు 55 మంది మొత్తం 32,638 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిశీలించిన అధికారులు మొత్తం 29,855 దరఖాస్తులను సంబంధిత బ్యాంకులకు పంపించారు. అయితే మిగతా దరఖాస్తుల్లో బ్యాంకు లింకేజీ లేనివి కొన్ని ఉండగా, మరికొన్నింటికి సరైన సమాచారం లేనివి ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే దరఖాస్తుదారులు తమ బ్యాంకు ఖాతాల వివరాలు ఇచ్చినప్పటికీ అధికారులు ఆ బ్యాంకుకు కాకుండా ఆ గ్రామం, వార్డు, ఏ బ్యాంకు పరిధిలోకి వస్తుందో సంబంధిత బ్యాంకులకు దరఖాస్తులు పంపినట్లు సమాచారం.

రిజర్వేషన్ల అమలు

ఎస్సీ కార్పొరేషన్‌లో వచ్చిన దరఖాస్తులను నూతనంగా జరిగిన ఎస్సీ వర్గీకరణ ఆధారంగానే లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు సమాచారం. ఎస్సీ ఉపకులాలైన బేడ బుడగ జంగాలు, చిందు, మాష్టి, రేలి, పిచ్చకుంట్ల, దాసరి, హొలియదాసరి, రేలంగిలతోపాటు మాదిగలు, మాలలు ఇలా కేటగిరిల వారీగా ఎవరికి కేటాయించిన వాటిల్లో వారిని ఎంపిక చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాకు 10.687 యూనిట్లు

జిల్లాకు రాజీవ్ యువ వికాసం పథకం కింద బ్యాంకు లింకేజీతో మొత్తం 10.687 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందులో బ్యాంకు లింకేజీ లేకుండా 3,498 యూనిట్లు, లక్షలోపు రుణాల కోసం 2632 యూనిట్లు, రూ.2 లక్షల వరకు 2261యూనిట్లు, రూ.4 లక్షల వరకు 2205 యూనిట్లు వీటితోపాటు 51 మైనర్ ఇరిగేషన్(సబ్ మెర్సిబుల్ పంప్‌లు, బోర్లు తదితర) యూనిట్లు మంజూరయ్యాయి. కాగా మొత్తం 32,638 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన ఒక్కో యూనిట్‌కు మూడు దరఖాస్తులు వచ్చాయి.

మొదటి విడత లక్షలోపు రుణాలు

రాజీవ్ యువ వికాస్ పథకం కింద మొదటి విడతలో రూ.లక్షలోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు జూన్ 2 నుంచి ప్రొసీడింగ్ చెక్కులను అందజేయనున్నారు. ఇప్పటి వరకు 90శాతం లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. రెండు రోజుల్లో మొత్తం పూర్తవుతుంది. అనంతరం లబ్ధిదారులకు సమాచారం అందజేస్తాం.

- విజయలక్ష్మి , ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

అన్ని బ్యాంకులు సర్వీస్ ఇవ్వాల్సిందే..

జిల్లాలో చాలా వరకు లబ్ధిదారులు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, గ్రామీణ వికాస్ బ్యాంకులలోనే ఖాతాలు కలిగి ఉంటాయి. మిగతా ప్రైవేట్ బ్యాంకులు సాధారణ ప్రజలు ఉండే ఏరియాలోనే ఉంటాయి. కానీ వారికి మాత్రం సేవలు అందించడం లేదు. కేవలం సంపన్న వర్గాలకే సేవలందిస్తున్నాయి. ఇది సరైన పద్ధతి కాదని ప్రభుత్వం చేపట్టిన పథకాలకైన ప్రైవేట్ బ్యాంకులు సర్వీసులు అందించాలన్న లక్ష్యంతో ఏరియాల వారీగా బ్యాంకులను ఎంపిక చేస్తారు.

- మూర్తి, లీడ్ బ్యాంక్ మేనేజర్

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి

ఆస్పత్రి ఎదుట మృతురాలి కుటుంబ సభ్యుల ధర్నా


అన్నపూర్ణ మృతదేహం

సదాశివపేట(సంగారెడ్డి): అనారోగ్యంతో ఆస్పత్రికి వస్తే చికిత్స చేసి మహిళ మృతదేహాన్ని అప్పగించారని మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని గురువారం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు జగదీశ్ భార్య అన్నపూర్ణ(42) ఈనెల 22న అనారోగ్యంతో సదాశివపేట పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేరింది. వారం రోజుల పాటు చికిత్స చేసిన వైద్యులు ఆరోగ్యం మెరుగుపడిందని గురువారం డిశ్చార్జ్ చేస్తామని బుధవారం రాత్రి కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ క్రమంలో రాత్రి 11 గంటలకు అన్నపూర్ణ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించడంతో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. విషయాన్ని గోప్యంగా ఉంచిన ఆస్పత్రి సిబ్బంది తమ తప్పేమీ లేదని బుకాయించే ప్రయత్నం చేశారు. దీంతో ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చివరకు రాజకీయ నాయకులు, పోలీసులు రంగ ప్రవేశంతో ఆస్పత్రి యజమాన్యంతో దాదాపు 4 గంటల పాటు చర్చలు జరిపారు. అనంతరం మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది.

నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలి


రాయిలాపూర్‌లో అవగాహన కల్పించిన అనంతరం రైతులతో శాస్త్రవేత్తలు

రాయిలాపూర్‌లో పంటలసాగుపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు అధిక దిగుబడులిచ్చే నాణ్యమైన విత్తనాలు ఎంచుకుని పంటలు సాగు చేయాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సూచించారు. గురువారం మండలంలోని రాయిలాపూర్‌లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐఐఆర్ఆర్ రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ బస్వరాజ్, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, ఎన్‌బీపీజీఆర్ హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రణుష, కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి గ్రామంలో వానాకాలం పంటల సాగు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. పంటలు సాగు చేసే ముందు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేయాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. వరిలో అధిక దిగుబడినిచ్చే సన్నరకం ఏఎస్ఎం 1638, దొడ్డురకం భాగ్యనగర్ ధాన్-75 సాగు చేయాలన్నారు. ప్రతి రైతు ఫార్మర్ ఐడీ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ స్వప్న, ఏఈఓలు సౌజన్య రైతులు పాల్గొన్నారు.

తోటి కార్మికుడి హత్య

- నిందితుడి పరారీ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన తూప్రాన్ డీఎస్పీ
- నిందితుడి కోసం పోలీసుల గాలింపు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): తోటి కార్మికుడిని హత్య చేసి పరారైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం... కేరళకు చెందిన నలీనికుమార్(40), వారం రోజుల క్రితం కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేయడానికి మండలంలోని కాళ్లకల్ శివారులో ఉన్న కిషాన్ ఇండస్ట్రీస్‌కు వచ్చి పరిశ్రమ గదుల్లో ఉంటున్నాడు. కాగా అదే పరిశ్రమలో పని చేయడానికి వచ్చిన మరో కార్మికుడు వడియాత నరేష్ సైతం నలీన్‌కుమార్ గదిలోనే ఉన్నాడు. ఉదయం గది తలుపులు తెరవకపోవడంతో సెక్యూరిటీ సిబ్బంది తలుపులు పగులగొట్టి చూడగా నలీనికుమార్ రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. హత్య చేసి పరారైన నరేష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా మృతుడిని ఎందుకు హత్య చేశాడో వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వెంటాడిన మృత్యువు

- బాలుడిని చిదిమేసిన ట్రాక్టర్ రొటోవేటర్
- మిరుదొడ్డి మండలం అల్వాలలో ఘటన


నికాస్ (ఫైల్)

మిరుదొడ్డి (దుబ్బాక): విధి రాత ఎలా రాసి ఉంటుందో ఎవరికీ తెలియదు. తన వెంట పొలానికి వద్దని, ఇంటి దగ్గరే ఉండాలని తండ్రి వారించినా వినకుండా వెళ్లిన ఓ బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బీడ కనకయ్య, లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులు. గురువారం ఉదయం తండ్రి కనకయ్య పొలానికి వెళ్తుండగా చిన్న కొడుకు నికాస్ (5) తాను వస్తానని మారాం చేయడంతో తీసుకెళ్లాడు. తండ్రి ట్రాక్టర్ రొటోవేటర్‌తో పొలాన్ని దున్నుతున్న క్రమంలో నికాస్‌ను ఇంజిన్‌పై కూర్చోబెట్టుకున్నాడు. ప్రమాదవశాత్తు అతను జారి రొటోవేటర్‌లో పడిపోయాడు. గమనించిన తండ్రి కనకయ్య అప్రమత్తమయ్యేలోపే ఘోరం జరిగిపోయింది. ప్రమాదంలో నికాస్ ముఖం నుజ్జునుజ్జు కాగా, ఎడమ కాలు పూర్తిగా తెగిపోయి వేరైంది. అచేతన స్థితిలో ఉన్న కొడుకు మృతదేహాన్ని పట్టుకొని తల్లిదండ్రులు విలపించడం అక్కడున్న వారిని కలచివేశాయి. కాగా బాలుడి తండ్రికి వినికిడి లోపం ఉన్నట్టు తెలిసింది. బాలుడు రొటోవేటర్‌లో పడ్డాక చేసిన ఆర్తనాదాలు అతడికి వినపడకపోయి ఉండొచ్చని గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆటోను ఢీకొన్న కారు

ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

బెజ్జంకి(సిద్దిపేట): రాజీవ్ రహదారిపై బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బెజ్జంకి పీఎస్ ఎస్‌హెచ్‌ఓ శంకర్‌రావు కథనం మేరకు... మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ ఎల్లయ్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజులానే బుధవారం ఆటోలో పాసింజర్‌ను గుండ్లపల్లెలో దింపాడు. తిరిగి వస్తున్న క్రమంలో తోటపల్లి స్టేజీ వద్ద గల రాజీవ్ రహదారిపై హైదరాబాద్ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన ఎల్లయ్యను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి


ప్రభుదాస్ మృతదేహం


వడ్డే నాగేష్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాగులపల్లికి చెందిన ప్రభుదాస్ (33) మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ద్విచక్ర వాహనంపై రంగారెడ్డి జిల్లా.. శంకర్‌పల్లి కొత్తగూడకు పనిపై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వంద ఫీట్ల సర్వీస్ రోడ్డులో నాగులపల్లి శివారు అపర్ణ గేట్ సమీపంలోకి రాగానే సంధుగూడంకు చెందిన వడ్డే నాగేష్ (35) తన ద్విచక్రవాహనంతో ప్రభుదాస్ పల్సర్‌ను ఢీకొట్టాడు.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ప్రభుదాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడ్డ నాగేష్‌ను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని రేషన్ డీలర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నందికంది శివారులో గురువారం చోటు చేసుకుంది. సీఐ మహేష్ గౌడ్ వివరాల ప్రకారం... మండలంలోని నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బుర్జుకాడి శ్రీనివాస్(51) రేషన్ డీలర్. వ్యక్తిగత పనులపై సదాశివపేట పట్టణానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి స్కూటీపై వస్తుండగా, నందికంది శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బలమైన గాయాలై మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్ర గాయాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): విద్యుత్ వైర్లు తగిలి ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని యెట్టిగడ్డసంగం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రసూల్(11) సదాశివపేట పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇంటికి వచ్చాడు. బుధవారం ఇంటి మేడపై అక్క, తమ్ముళ్లతో ఆడుకుంటుండగా ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ వైర్లకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వర్షాకాలం.. జీవాలు భద్రం

- గొర్రెలకు చిటుకు వ్యాధి సోకే ప్రమాదం
- చికిత్స కన్న నివారణ మేలు
- రైతులకు సూచనలు చేసిన పశువైద్య అధికారులు


గడ్డి మేస్తున్న జీవాలు

దుబ్బాకటౌన్: తొలకరి చినుకులు జిల్లాను పలకరించాయి. తొలకరిలో గొర్రెల పెంపకం దారులు తరుచూ నష్టాలకు గురవుతుంటారు. తొలకరి చినుకులకు మొలిసిన గడ్డిని ఎక్కువగా జీవాలు తినడం వల్ల చిటుకు వ్యాధి వస్తుంది. దీనినే నెత్తిపిడుగు, గడ్డి రోగం, పాటు రోగం అని కూడా అంటారు. ఈ వ్యాధి నివారణకు గొర్రెల పెంపకం దారులు తగు జాగ్రత్తలు పాటించాలని దుబ్బాక పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలసుందరం కొన్ని సూచనలు చేశారు. బలిష్టంగా పెరిగిన గొర్రెలు వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మేత కోసం వలస వెళ్లే గొర్రెల్లో ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. క్లాస్ట్రీడియం ఫర్ ఫ్రింజర్స్ టైప్-డీ రకం సూక్ష్మజీవులు జీవాల ప్రేగుల్లో గాలి లేని వాతావరణంలో అభివృద్ధి చెందుతాయి. ఇవి వదిలిన విషపదార్థాలు చిటుకు వ్యాధికి కారణమవుతాయి. తొలకరి చినుకులకు పెరిగిన గడ్డిని గొర్రెలు అధికంగా తింటాయి. దీని వల్ల వాటి ప్రేగుల్లో గాలి లేని వాతావరణం ఏర్పడి సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది వ్యాధిని కలుగజేస్తాయి. ఈ వ్యాధి తొలకరి చినుకులు పడినప్పటి నుంచి జూలై నెలాఖరు వరకు ఎక్కువగా వస్తుంది.


బాలసుందరం, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, దుబ్బాక

నివారణ ముఖ్యం

చికిత్స కంటే వ్యాధి నివారణే ముఖ్యం. ఏటా ఏప్రిల్, మే నెలల మధ్యలో వ్యాధి నిరోధక టీకా (మల్టీ కాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) మందలో ఉన్న జీవాలన్నింటికి తప్పకుండా వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో పశువైద్యాధికారికి తెలియజేసి చికిత్స, జాగ్రత్తలు పాటించాలి. తొలకరి వర్షాలకు మొలిచి వాడిపోయిన గడ్డిని మేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సాయంత్రం సమయంలో జీవాలను మేపకూడదు. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి. జాగ్రత్తలు పాటిస్తే చిటుకు వ్యాధి బారి నుంచి జీవాలను కాపాడుకోవచ్చు.

వ్యాధి లక్షణాలు...

ఈ వ్యాధి సోకిన గొర్రెలు సాధారణంగా ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే అకస్మాత్తుగా మరణిస్తాయి. చనిపోయే ముందు చాలా నీరసంగా ఉంటాయి. ఎగిరి కిందపడి కాళ్లు కింద కొట్టుకుంటూ, పళ్లు కొరుకుతూ..బిగుసుకుని కొన్ని క్షణాల్లో చనిపోతాయి. వ్యాధి సోకిన మరి కొన్ని గొర్రెలు చొంగ కారుస్తుంటాయి. శ్వాస అధికంగా ఉంటుంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి మందకు చికిత్స చేయించాలి.